
మిత్రుడు మధుసూదన్ రైలు కదులుతుండగా "జబల్‌పూర్ వెళ్తున్నావు— భేడాఘాట్ తప్పకుండా వెళ్ళు" అన్నాడు.

అంతటితో వూరుకోకుండా ప్లాట్‌ఫారంమీద రైలుతోపాటు కదులుతూ "భేడాఘాట్ మొసలిని చూడకుండా రావద్దు" అని అరిచాడు.

# భేడాఘాట్ మొసలి

బలివాడ కాంతారావు




వివరాలు అడగడానికి రైలు ప్లాటుఫారం వదిలింది. భేడాఘాట్‌లో చలువ రాతి గుట్టలున్నాయని విన్నాను. కానీ అక్కడొక మొసలివుందనీ, అది అందమైన చలువరాతి గుట్టలకన్నా చూడతగ్గదని విన్నాక యెలాగైనా అక్కడకు వెళ్ళడానికే నిశ్చయించాను.

ఒకనాటి సాయంత్రం ఒక టెంపో మీద పదుగురితో పాటు జబల్‌పూర్ నుంచి భేడాఘాట్ చేరుకున్నాను. చూడ్డానికి మామూలు కొండప్రదేశంలానే వుంది. తప్పితే యెదరగావున్న గుట్టలు అక్కడక్కడ సున్నం పులుముకున్నట్లు కనిపిస్తున్నాయ్. ఇంత దూరం వచ్చి మొసలిని చూడకుండా తిరిగిపోలేను. నదిగట్టుకు వెళ్ళాను. బారులుతీరి పడవలు వున్నాయి.

నవంబరు నెల- నర్మదా నది నవవధువు గృహప్రవేశం చేస్తున్నట్లు నెమ్మదిగా కదులుతోంది. నది ఒక సరోవరమై అక్కడక్కడ తెల్లకలువల్లా చలువరాతి గుట్టలు తలెత్తి చూస్తున్నయ్.

పడవమీదపోవడానికికదలుతుంటేనేనూ ఆ యెనమండుగురిలో ఒకడి నయ్యాను. ఇందులో యూనివర్శిటీ విద్యార్థులు ముగ్గురు, పింఛనీదారులు యిద్దరు, వ్యాపారస్తులు యిద్దరు, నేనూ ఒకరినొకరు పరిచయం చేసుకున్నాం. మాకోసం పడవ రాబోతోంది.

"డబ్బు తిరుగుదలలో యిస్తాం." అన్నాను ఆ పడవల పెద్దతో. ఎందుకంటే నా దగ్గర నాలుగు రూపాయల చిల్లరలేదు.

"మీరే దయచేసి అందరి దగ్గర వసూలు చేసి తిరిగివచ్చేక యిచ్చేయండి" అన్నాడు.

చూడ్డానికి వందనంగా వున్నాడు. వేసుకున్న బట్టలు తెల్లగా వున్నయ్. తలమీద తెల్లని టోపీవుంది. నెమ్మదైన పలుకులు ముఖంలో కళ వుంది. అలాంటి వానితో నా కోరిక చెప్పుకుంటే తీరుతుందని —

"ఇక్కడ మొసలి వుందట - ఎక్కడండీ ?" అన్నాను. అక్కడే వున్న గైడ్‌ని పిలిచాడు.

"ప్రశ్నలు అందరూ అడగను, ప్రశ్నలు అడిగినవారికి సమాధానం చెప్పలేని వాళ్ళకు ఈ బిజినెస్‌లో చోటులేదు, చూపించు — ఆ మొసలిని చూపించు" అన్నాడు.

"చిత్తం" అన్నాడు గైడు.

పడవకోసం అందరం ఒడ్డున ఆగాం. గైడ్ ప్రక్కన నిల్చోని "అంత గౌరవం యిస్తున్నావు. అతగాడు ఈ పడవలకు పెద్దా? లేక పెద్దకు చుట్టమా? నౌకరా" అన్నాను.

"అతనే పెద్ద. స్వయంగా అంతా చూసుకుంటాడు. అతను లేకపోతే భేడాఘాట్ లే"దన్నాడు.

"అంటే....?"

"అది గదిగో చూడండి. ఆ కోవెల ఈ భక్తుడు కట్టించిందే...."

"అలానా?"

"మరి మీరు దిగారే.... ఆ బస్సుస్టాపులన్నీ యితని ధర్మమే...."

ఇంకేదో చెప్పబోతుంటే బోటు ఎదరగా వచ్చింది. ఇద్దరే యిద్దరు నడుపుతున్నారు. చిన్న చలిగాలివీస్తోంది. ఇద్దరిశరీరాలమీద కట్ బనియన్లు చిరిగి వున్నయ్.

బాగా మాసిపోయివున్నాయ్. బోటు కదులుతోంది. గైడ్ చంకలో గొడుగు పెట్టుకుని ఒకమూల కూర్చున్నాడు. ఎక్కిన యెనమండుగుర్లో బరువుల తేడాలున్నాయి కాబట్టి పడవ నడిపే వాళ్ళు మనుషులను సర్దుతున్నారు. ఐనా పడవకాస్త యిటూ, అటూ జోగుతోంది.

గైడ్ అరిచాడు—

"ఇది భేడా ఘాట్.... భేడా అంటే?"

"గొర్రెపోతు" అని ఒక యాత్రికుడు అరిచాడు.

"తెల్లగొర్రెలు పోట్లాడుకోబట్టే ఈ తెలుపు"—అని యింకొకడు వ్యాఖ్యానించాడు.

"కాదు కాదు" అని అథారిటీతో చెప్తూ "భేడా అంటే కూడలి. ఇక్కడ దేవతలంతా కూడారు! ఎందుకు? నర్మదాదేవి తన త్రోవకు అడ్డంగా వున్న ఈకొండను కోసుకుని పోతాను అని పంతంపట్టింది. అది అంత సులువా? అప్పుడు శివుడు ఆమె సహాయానికి వచ్చి తన మహత్యంతో ఈ కొండను రెండున్నరరోజులు వెన్నముద్దగా మార్చేసి ఆపైన అతను కళ్ళుమూసి తపస్సు చేసుకున్నాడు."

ఇంతలో యూనివర్శిటీ కుర్రాడు అరిచాడు "ఆ కాకమ్మ కబుర్లెవరికి కావాలి?"

"అవి దేవతల కబుర్లు- తప్పు తప్పు- అలా అనకు" అన్నాడు పించనీదారు".

"ఓ గైడ్- చెప్పు. బాబీ సినీమాలో ఆ ఆఖరిసీను ఎక్కడతీశారు? చూపించు" విద్యార్థి.

"అదిగో అక్కడే" అంటూ తూర్పు వేపు చూపించాడు గొడుగుతో.

"సినిమాదేవతల కబుర్లెందుకు?నర్మదాదేవి అప్పుడు యేం చేసింది?" యింకో పింఛనీదారుడు అనగానే యిక బోటులో రెండు పార్టీలు లేచాయి.

"అదిగో—అక్కడే దత్తాత్రేయుడు, భృగు ముని తపస్సు చేశాడు" అన్నాడు గైడు.

"ఆపవయ్యా ఆపు. ప్రాణ్ డింపుల్‌ని రక్షించడానికి యెక్కడనించి గెంతాడు చూపించవయ్యా?" యింకో స్టూడెంటు అరిచాడు.

ఈ ఉద్రేకాల్లో బోటు యిటూ, అటూ కదలిపోతుంటే బోటు నడిపేవాళ్ళిద్దరి చేతులూ తమాషాగా కదలుతున్నాయి. నేను ఆ కదిలే చేతుల అందముందు ఈ కదలని ప్రకృతినే పట్టించుకోలేదు. ఊహలూ కదలిపోతున్నాయి. చెంతనున్న ఒక బోటు నడిపేవానితో అన్నాను.

"నీకేమిస్తారు?"

"ఒకోసారికి రూపాయిన్నర."

"అంటే ఈ ముప్ఫయిరెండు రూపాయల్లో నడిపే మీ యిద్దరికీ వృత్తి మూడు రూపాయలే."

"అదీ మీలాంటి మారాజు లొచ్చినప్పుడుంటాది, లేకపోతేలేదు."

"నీ కెంతమంది పిల్లలు?"

'ఇద్దరు పోగా మిగిలినవాళ్ళు ముగ్గురు'

"వాడికో....?"

"వాడిది పెద్ద సంతానమండీ. ఆరుగురు పుట్టారు — ఆరుగురూ మిగిలేవున్నారు!"

"పెళ్ళానీన్నీ — ఆరుగుర్నీ ఈ బత్తెంతోనే పోషిస్తున్నాడా?"

"అందులో ముగ్గు రడుక్కుంటున్నారండి."

టెంపో దిగగానే మమ్మల్ని చుట్టుముట్టిన దిగంబర భిక్షకుల్లో వీడి పిల్లలూ వుంటారనుకున్నాను.

"అదిగో చూడండి. నది మధ్యలో ఆ గుట్ట. ఈ గుట్టమీద ఒక ఋషి పుంగవుడుండేవాడు. అతనొక మొసలిని ...." గైడ్ చెప్పబోతుంటే యూనివర్శిటీ విద్యార్థి గైడ్ నోరు మూసాడు.

"అవిగో—ఆ కొండల గురించి చెప్పుగానీ ఈ సన్యాసుల గురించి చెప్పావో చూడు ఏంచేస్తామో?" అని బెదిరించాడు.

"చిత్తం—చిత్తం...." అంటూ

"చూడండి బాబూ అటు చూడండి. ఆ వైభవం చూడండి. తాజ్‌మహల్ చూసినా మీ శరీరం యిలా పులకించదు. చూడండి—తనివితీరా చూడండి" అన్నాడు.

పడవ ఆ గుట్ట చుట్టే మలుపు తిరగగానే





# కేశవర్ధినిని

మీరు తలకు రాసుకొనే నూనెలో కలిపి ఉపయోగిస్తే అధికంగా మంచి గుణాన్ని పొందుతారు. మీ తల వెంట్రుకలు ఒత్తుగా రోజు రోజుకీ పొడుగ్గా పెరుగుతాయి.

దక్షిణ భారతదేశపు సాంప్రదాయిక కేశ సౌందర్య రహస్యమే కేశవర్ధిని. మీరు వాడుకొనే తలనూనెలో కేశవర్ధినిని కలిపి ప్రతీ రోజూ తలకురాసి తల చర్మానికి అంటేటట్లు చేయండి. మీ తల వెంట్రుకలు ఊడి పోకుండా జేసి ఆరోగ్యవంతంగా అందంగా పెరిగించడానికి ఇదేమంచి మార్గము ఇప్పుడే కేశవర్ధినిని ఉపయోగించడం మొదలు పెట్టండి. కేశవర్ధిని సాధారణ తల నూనెకాదు. దీన్ని కొబ్బరినూనె లోనో లేక మీరు వాడే ఇతర తల నూనెలోనో కలిపి వాడాలి

**కేశవర్ధిని ప్రోడక్ట్స్**, ఆర్కాటు రోడ్డు, మద్రాసు—600 087

OBM 383/2 TG

## బాల గోపాలం



ఎగరాలి మా పాప
ఎగురుతూ నవ్వాలి!
ఫొటో : టి. యం. రెడ్డి, విజయవాడ

గెడలా సన్నగావున్న నదికి రెండుగట్లూ చలువరాతివి. క్రుంగుతున్న పొద్దు-పొగలా కక్కుతున్న వెలుగు ఈ రంగు రంగు చలువరాతి పలకలపై పడుతుంటే అద్దం మీద వెల్తురు పడ్తున్నట్లుంది. ప్రతిబింబిస్తున్న వెలుగుమీదికెగసి నింగిలోని చందమామకు మెరుగులు దిద్దుతోంది.

"అవిగో మనుషుల ఆకారాలు—ఏనుగులు, కోతులు—అవి మనుషులు చెక్కినవి కావు—దేవతలు కూర్చినవి" అన్నాడు గైడు.

"దేవతల పేరెత్తకు. ప్రవాహం శిల్పిమై చెక్కిందయ్యా" అని ఒక స్టూడెంటు అరిచాడు.

పడవ ముందుకు పోతోంది. పొద్దు క్రుంగిపోయింది. స్నానంచేసి ముఖానికి పౌడరు ఒత్తుకున్న యౌవ్వనిలా చందమామ సింగారించుకుంటోంది.

"చూడు—మీ అమ్మ అడగంది అన్నం పెట్టిందా?" అన్నాను బోటువానితో.

"లేదు"

"నీ పెళ్ళాం నువ్వు తెస్తేకదా నీకూ, పిల్లలకూ రొట్టెకాల్చి పెట్టేది."

"అవును"

"రావలసింది రాబట్టుకోలేనివాడు అమాయకుడు కాదు — చాతకానివాడు."

"నాకు దేముడు రాసింది ఎవడూ తప్పించలేడు."

"నీలాంటి వాళ్ళను దోచుకుని హాయిగా బ్రతుకుతున్న వాళ్ళే ఆ దేముడ్ని సృష్టించారు. ఆ దేవుడిమీద భక్తిపేరిట మీలో భయం సృష్టించారు. అసలు దేముడికి పిరికివాళ్ళంటే అసహ్యం. చేతకాని మీలాంటి వాళ్ళవేపు చూడేచూడడు."


"ఏంచెయ్యమంటారు బాబూ? మాలాటి పేదోళ్లని పాములైనా కరుస్తాయి. ఏనుగులైనా పట్టేస్తాయి"

"మీరంతా చీమల్లా కష్టపడుతున్నారు. మీరంతా యేకమైతే-పాము చస్తుంది! మీరంతా గడ్డిపోచలే—ఒకపై ఒకతాడులా ఏనుగును బంధించలేరా? మీ రెంతమంది కక్కడ?"

"పాతికమంది వుంటామండీ;"

"మీరంతా యేకమవ్వండి. అడగండి-మీకు న్యాయంగా రావలసింది అడగండి."

"సేఠ్ గట్టోడండి. అధికారులు, పోలీసులూ ఆడి పక్కేనండి. అందర్నీ కొనీశాడండి."




"మీ మాంసం కండలు కుళ్ళిపోయాయా? మీ ఎముకలు చెదపట్టాయా?"

"అయితే మేమంతా కలిసి అడిగితే నెగ్గుతామండీ?"

కొత్త భావాన్ని సంఘం అంత చులకనగా స్వీకరించదు. కొత్తకోరికని యజమానీ ఔననడు. అందుకే అన్నాను.

"మీరంతా కలసికట్టుగా అలజడిచేస్తేగానీ.... సేఠ్ మీ జీతాలు పెంచాలని అనుకోడు! వాడికేం? సుఖంగా వున్నాడు. మీ బాధలు వాడికేం తెలుసు? ఇది భేడాఘాట్. ఇక్కడ కొమ్ములు తిరిగిన పోట్లేళ్ళు ఈ కొండలతో ఢీకొన్నాయట-ఆ పోట్లేళ్ళబలానికిచిహ్నాలు ఈమార్బుల్ రాక్స్. ఊఁ మీరంతా ఒకే గొంతుకతో అడగండి— రూపాయిన్నర కాదు—మూడు రూపాయలు. ఎలా యివ్వడో ఎన్నాళ్ళివ్వడో చూద్దాం."

పడవ తిరుగుముఖం పట్టింది. ఇదివరకటికంటే స్పీడుగా పోతోంది. మిగతా పడవలు కూడా తిరుగుముఖం పడ్తున్నాయ్. చప్పున నేను వచ్చినపని గుర్తుకొచ్చింది. గైడ్‌తో అన్నాను.

"ఏదీ భేడాఘాట్ మొసలి.... ఎక్కడ?"

"ఉండండి. ఇంకొస్త ఓపిక పట్టండి చూపిస్తాను."

ఆ గైడే మొసలిలా ఆ పళ్ళతో కనిపిస్తుంటే" అని ఒక స్టూడెంట్ చమత్కరిస్తే-ఇంకొకడు:

"అదేపనిగా ఏనుగును నమిలేస్తున్నాడు." గైడ్‌కు కోపం వచ్చినట్లుంది. నములుతున్న ఖారాఖిల్లీని వుమ్మేశాడు.

పడవ కదులుతోంది. కదలకుండా తొమ్మండుగురం కూర్చున్నాం. మానోళ్లు కూడా కదల్లేదు. చలువరాతి గుట్టలఅందం అంతా అపురూపమైన దేవకన్యలా మారి ప్రత్యక్షమైంది. చప్పున చిన్న శబ్దం. ఏ చలువరాయి బెడ్డ నీట్లో ఒరిగిందో! లేక ఆ దేవకన్య ఒకసారి డుబ్బున మునిగిందో? గైడ్ అరిచాడు "అదిగో— అదిగో—అదే మొసలి."

"ఏదీ—ఏదీ" అని లేచి నిల్చోబోయాను పడవవాడు నాచెయ్యి పట్టుక కూర్చోబెట్టేశాడు. ఒకనాడు సాధువున్న గుట్ట. ఆ గుట్టమీదవున్న మొసలి మనుషుల చప్పుడికే నీటిలోకి దూకిందట! చేతులు నీట్లో పెట్టకండని అరిచాడు గైడు. కళ్ళుచించుకుని చూసినా మొసలి కనపడలేదు. చెవులు రిక్కించి విన్నా ఆ శబ్దం వినపడలేదు.

"ఇది మొసలికాదు — మోసం" అని అరిచాడొక విద్యార్థి.

## బాల గోపాలం



అమ్మ సినిమాకెళ్ళింది!

ఫొటో : సి హెచ్. లక్ష్మీనారాయణ. తెనాలి

"అది మొసలే. తప్పు-తప్పు- పాపం! అలా అనకండి" అరిచాడొక పడవనడిపే వాడు.

ఇంకో విద్యార్థి "అదిగో మొసలి" అని అరిచాడు. చిన్న శబ్దమయింది. ఆత్రంతగా చూశాను.

"పదిపైసలు విసిరాను నీళ్లో-మొసలి నోట్లోకి" అన్నాడా విద్యార్థి.

అదిగో పులి అని అపహాస్యంచేసి అరుస్తున్నాంగానీ నిజంగా మొసలే దగ్గరగావస్తే గజగజలాడే వాళ్ళంకదా? గజరాజునే గజగజలాడించి కుయ్యోమొర్రో మని విష్ణుమూర్తితో "కలడందురు దీనుల యెడ...." అని మొరపెట్టుకో నిచ్చింది కదా—అసలు మా మధుసూధన్ మొసలిని చూడకుండా నన్ను తప్పక చూడమంటా డెందుకు? ఆనాడు ఏప్రిల్ ఒకటో తేదీ కాదు. నన్ను అనవసరంగా ఫూల్ చేస్తా డెందుకు? నిరాశతో ఒడ్డు చేరుకున్నాను. పోనీ మొసలిని చూడకపోయినా యేదో ఒక పని యిక్కడ చేశాననిపించు కుందామని బోటు పెద్దదగ్గరకు వెళ్ళి.

"ఇదిగో ముప్ఫయిరెండు రూపాయలు. ఇందులో కనీసం చెరో మూడు రూపాయలు బోటువాళ్ళకి చెందాలి. ఆరు రూపాయలు మినహాయించి యిరవై ఆరు రూపాయ లిస్తున్నా తీసుకోండి" అన్నాను.

"మీరంతా కలసి వాళ్ళకేం యిచ్చా" రన్నాడు.

"మేం యెందుకివ్వాలి?" అన్నాను.

వాడి పేరేమిటోనని తడుముకుంటుంటే గైడ్ "ధర్మస్వరూప్‌జీ! వీళ్ళంతా అం జడి జట్టు, పిసినారి జట్టునూ యెప్పుడూ నేను బోటుమీద తీసుక వెళ్ళలే" దన్నాడు.

"ఇలా సూటిగా అడిగిన మనిషి యిదివర కెప్పుడూ యిక్కడకు రాలేదు" అంటూ నావేపు తిరిగి నా చేతులు పట్టుకుని "తప్పక ఆరురూపాయలు వాళ్ళిద్దరికీ యివ్వండి" అన్నాడు.

గెలిచాననే ముందుకు వెళ్ళాను. వారిద్దరూ ఆ డబ్బు తీసుకోలేదు. సేఠ్‌కు యిచ్చేయండి అన్నాడొకడు. నా వొళ్ళంతా పదించిపోయింది. సేఠ్ నన్ను యెగిరి పోతున్న దూదిలా చూశాడు.

"ఏయ్-ఇతగాడికి మొసలిని చూపించావా?" అని అడిగాడు గైడ్‌ను.

"చూపించాను. కానీ వాళ్ళు నమ్మితేనా?"

ధర్మస్వరూప్ నా దగ్గరగా వచ్చాడు. చేతులు పట్టుకున్నాడు. "నాకు మీమీద గౌరవం లేకపోతే యిలా మీ చేతులు పట్టుకోను. ఈ లోకం ఈ చెరువులాంటిదే. ఇందులో పెద్ద చేప చిన్న చేపను మింగి బతుకుతాది. వ్యాపారంలో వున్నవాళ్ళు అదే చేస్తారు. అరే బాబురే! ఇందులో వున్న కాంపిటీషన్ యింకెందులోనూ లేదు. ఎంతకువేలాం పాట పాడానో నాకెంత మిగిలిపోతుందో అన్నీ వివరంగా లెఖ్ఖలు రాశాను. మీరు దయచేసి ఈ రాత్రి


మీ అబ్బాయి చదువు— ఉజ్వల భవిష్యత్తు— త్వరపడండి!

తాడికొండ, సర్వేల్లి, కొడిగన్ హల్లి రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్సు

అడ్మిషన్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ప్రారంభమయినది.

గవర్నమెంటు అడ్మిషను పరీక్షలు పాసై స్కాలర్‌షిప్‌తో చదువు!

షరా : షెడ్యూలు జాతులవారికి, డిఫెన్సు సర్వీసులో వున్నవారికి ప్రత్యేక రిజర్వేషన్లు.

హైదరాబాదు, ఋషీవాలీ పబ్లిక్ స్కూల్సు ప్రవేశ పరీక్షల కోచింగుకు వెంటనే చేర్చండి.

స్థాపితం : *1962* ఫోన్ : *22084*

# శ్రీ విద్యా విహార్

*(ఆదర్శ గురుకుల విద్యాసంస్థ)*

రింగ్‌రోడ్, లలితానందనగర్,

నవభారత్ గెస్ట్‌హౌస్ దగ్గర, గుంటూరు–522 006.

పట్టణ వాతావరణమునకు దూరముగా ప్రశాంత వాతావరణములో బాలబాలికలకు ఇంటిని మరపించు చక్కని హాస్టలు వసతి కలదు.

## నర్సరీ నుండి 8వ తరగతి వరకు


* ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలో బోధన

స్థానికులకు స్కూలు బస్సు సౌకర్యము కలదు.

వివరములకు వెంటనే ఉచిత ప్రాస్పెక్టస్‌కై వ్రాయండి.

ప్రిన్సిపాల్ : **యం. వి. పూర్ణచంద్రరావు**

డైరెక్టర్ : **యం. వి. రామకృష్ణారావు**




నా ఆతిథ్యం స్వీకరించి ఆ లెఖ్ఖలు చూడండి. మీరెలా సెటిల్ చేస్తే అలాగే ఒప్పుకుంటాను. ఈ కార్మికుల మేలు కోరే వారైతే వుండండి. అదిగో ఆ వొడ్డునే కూర్చోండి. మొసలి యిలాగే వస్తుంది. ఇంకా టైముంది. ఈ వెన్నెల రాత్రిలో కనిపిస్తుంది. మీకు చూపించి మరీ యింటికి తీసుకవెళ్తాను." అని ప్రాధేయపడ్డాడు.

ఇతను నేను వూహించినంత చెడ్డ మనిషిలా కనపడలేదు. మానవత్వంమీద విశ్వాసం, తోటి మనుషుల కష్టాలకు సానుభూతి వున్నట్లుంది. తనకున్న యిబ్బందులు తనకూ వున్నట్లున్నయ్. నే నెవర్నో తెలుసుకోకుండా నా చేష్టలకు ఏమీ ప్రసాదించి నన్ను బ్రతిమాలి శాంతపరచిన వాడిని కాదనలేకపోయాను.

నది ఒడ్డునే కూర్చున్నాను. రెండు కాళ్ళు నీటిలో పెట్టాను. చల్లగావుంది. మొసలి వస్తుందేమోనని చప్పున కాళ్ళు ఒడ్డుకు తీసేశాను.

తూర్పున గురుగ్రహం కనకపుష్య రాగంలా వుంది. పశ్చిమంలో శుక్ర గ్రహం వజ్రంలా మెరిసిపోతోంది. నడినెత్తిమీద అర్ధచంద్రుడు కడిగిన విరిగిన ముత్యంలా మెరుస్తున్నాడు. ఈ మూడే మూడు ఆకాశాన్నంతా ఆక్రమించేశాయి. ఏమూలనైనా ఒక మబ్బుతునక కనిపిస్తుందేమోనని వెతికాను. చప్పున ఆ దిగువకు నైఋతి దిశలో ఒక మెరుపు మెరసినట్లయింది. ఆ మెరుపు మెరిసిన ఓ క్షణం వెన్నెల్లోకన్నా అందంగా కనిపించాయి గుట్టలు. నింగిలో అలజడితో నీరు కదలింది. అక్కడ కూర్చొనే పడవల మూకలన్నీ ఒకచోట చేరటం చూస్తున్నాను. పడవలు నడిపే మనుషులు నన్నని నీడల్లా కదలుతున్నారు. ఆకాశంలో మేఘాలు పేరుకుంటున్నాయి. హాయిగా కదలుతున్న చందమామను వెంటాడుతున్నాయి. ఈ మనుషులంతా గుంపుగా యజమానివేపు కదలుతున్నారు.

ఒక మెరుపు మెరిసింది. కొద్దిసేపట్లో ఉరుము వినపడింది.

"రేపటినించి ఈ పడవలు నడపం!" అంతా అరిచారు ఏక కంఠంతో.

"ఏం?"

"మనిషికి మూడు రూపాయలిస్తేగానీ పడవ నడపం" అని అరిచిందొక గొంతుక.

"ఎవరూ? నివ్వా శామ్‌లాల్! నీ పెళ్ళాం రోగంతో చచ్చిపోతుందంటే యేభయి రూపాయలు మందులకోని వూరకనే యిచ్చాను. నివ్వే నా మీద కత్తి కట్టున్నావురా? నివ్వు లీడరయి పోతున్నావురా?" అరిచాడు యజమాని.

"ఏది ఏమైనా అంత కూలి యిస్తేగానీ మేం పనిలోకి రాం."

"రాకండి- రావద్దు. మీరు రాకపోతే రూపాయికి వచ్చే వాళ్ళు వందలకొద్దీ వున్నారు!"

"ఒక్క పిట్టనుయిటువేపు రానివ్వము."

"పిట్టను రానివ్వకపోతే పోలీసులను రానివ్వరురా- వాళ్ళు తుపాకులను పేలుస్తారు. మీలో ఎవరు చచ్చినా నాకే బాధ. ఇది మీలో పుట్టిన బుద్ధి కాదు. ఎవరో మిమ్మల్ని నూరిపోశారు. ఎవరో కాదు— వాడే- వాడిమాట విన్నారూ రోజుకో రొట్టె ముక్కయినా లేకుండాపోతారు. నామాట వినండి- పాడై పోకండి" అంటూ నావేపు ఛర్రున వస్తుంటే అందరూ నావేపు రాకుండా వాడ్ని అడ్డుకున్నారు. ఈ రాత్రికి ఆతిథ్యం స్వీకరించమని నమ్మించి, నన్ను కోతిని చేశాడే అనుకున్నాను. స్ప్రింగులా ఒక్క గెంతు గెంతి నన్ను పక్కకు తోశాడు శ్యామ్‌లాల్.

"బాబూజీ కనిపించిందా? భేడాఘాట్ మొసలి కనిపించిందా? అదిగో — అదిగో భేడాఘాట్ మొసలి. ఆ కన్నీరు అసలు కన్నీరు కాదన్రో. ఆ మొసలి కన్నీరుని చూసి మోసపోయాం యిన్నాళ్ళు. ఇలాగే ఒకే మాటమీద వుండి అడిగి మా హక్కులను రక్షించుకుంటాం. చూశారా బాబూ భేడా ఘాట్ మొసలిని చూశారా" అని అంటూ నన్ను బస్సు స్టాపుదాకా వచ్చి దిగబెట్టారు శ్యామ్‌లాల్, యింకా కొంత మంది పడవవాళ్ళు. ★

